అప్పీలు చేసుకున్న వారికే 1న పింఛన్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

కలెక్టర్‌కు వికలాంగుల వినతి

తిరుపతి జిల్లాలో అనర్హత నోటీసు అందుకున్న పింఛన్ లబ్ధిదారులు ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ వద్ద అప్పీలు చేసుకోవాలని, అలా చేసుకున్న వారికే రాబోయే సెప్టెంబర్ 1 తేదీన పింఛన్లను అందించనున్నామని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 6,397 మందిని అనర్హులుగా గుర్తించి అధికారులు నోటీసులు ఇచ్చారు. తిరుపతి జిల్లాలో నోటీసులు అందుకున్న వారు ఇప్పటివరకూ (గురువారం రాత్రి 9 గంటల వరకూ) 3,900 మంది అప్పీలు చేసుకున్నారని అధికారులు తెలిపారు. నోటీసులను వెనక్కి తీసుకోవాలని, లబ్ధిదారులందరికీ పింఛన్లు కొనసాగించాలని వికలాంగులు కోరుతుండగా, ప్రభుత్వం 'రీ వెరిఫికేషన్' పేరుతో ముందుకే వెళుతుండటం గమనార్హం.

బిరబిరా కృష్ణమ్మ..!

- రేపు కుప్పంలో 'జలహారతి'
- నేడు చంద్రబాబు దంపతులు రాక
- 6,400 ఎకరాలకు సాగునీరు
- నాలుగు మండలాలకు తాగునీరు

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కుప్పం బ్రాంచి కాల్వలో కృష్ణాజలాలు బిరబిరా ప్రవహిస్తున్నాయి. హంద్రీనీవా కాల్వకు కొత్త కళ తెచ్చింది. శాంతిపురం మండలంలోని పరమసముద్రం చెరువు కృష్ణాజలాలతో తొణికిసలాడుతోంది. కృష్ణా జలాలకు హారతి, సారె సమర్పించడానికి రెండు రోజుల పర్యటన కోసం సిఎం చంద్రబాబు సతీసమేతంగా శుక్రవారం కుప్పం చేరుకుంటారు. పరమసముద్రం చెరువు వద్ద శనివారం జలహారతి ఇస్తారు. ఈ చెరువు నుంచి కుప్పం, పలమనేరులోని 110 చెరువులను అనుసంధానం చేయడానికి మార్గం ఏర్పడిందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం తుమ్మిసి గ్రామం సమీపంలో కాల్వ వద్ద ప్రత్యేకంగా ఘాట్ ఏర్పాటుచేశారు. దీనికి దగ్గరలోనే 18 అడుగుల చిరస్మరణీయ జ్ఞాపకంగా పైలాన్ నిర్మిస్తున్నారు. కాల్వలో నీటి లోతు పరిశీలించడం, పరిసర ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాయలసీమ వరప్రసాదినిగా భావించే హంద్రీనీవా సుజల స్రవంతి కాల్వకు నంద్యాల సమీపంలోని మల్యాల ఎత్తిపోతల వద్ద జులై 17న కృష్ణా జలాలను విడుదల చేశారు. ఆగస్టు 23న కుప్పం నియోజకవర్గ పరిధిలోని రామకుప్పం మండలం వర్థికుప్పం వద్దకు కృష్ణాజలాలు చేరాయి. చివరి మజిలీగా పరమసముద్రంలోకి 25వ తేదీ చేరాయి. ప్రస్తుతం ఈ చెరువులు కృష్ణా జలాలతో కళకళలాడుతున్నాయి. సిఎం చంద్రబాబు జలహారతి ఇచ్చే సమయానికి హంద్రీనీవా కాల్వ వెంబడి నియోజకవర్గంలోని 25 ప్రదేశాల్లో రైతులతో పూజలు చేయించడానికి కార్యక్రమాన్ని ఖరారు చేశారు. ఈ ఏడాది రూ.3,850 కోట్లు వెచ్చించి కృష్ణాజలాలను కుప్పం నియోజకవర్గానికి తెచ్చేందుకు వెచ్చించారు. 110 చెరువులను అనుసంధానం చేసి, 6,400 ఎకరాల ఆయకట్టుకు, నాలుగు మండలాల్లో తాగునీటి అవసరాలకు ఉపయోగించనున్నారు.

సిఎం పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దంపతులు శుక్రవారం సాయంత్రం 6.20 గంటలకు శాంతిపురం మండలం కడపల్లిలోని స్వగృహానికి చేరుకుంటారు. ఆ రాత్రికి అక్కడే బస చేస్తారు. శనివారం ఉదయం 10 గంటలకు స్వగృహం నుంచి సతీమణి భువనేశ్వరితో కలిసి బస్సులో బయల్దేరి రోడ్డు మార్గంలో కుప్పం మండలం హంద్రీనీవా కాల్వ పరమసముద్రం గ్రామానికి 10.30 గంటలకు చేరుకుంటారు. 10.30 నుంచి 11.15 వరకూ 'జలహారతి' సమర్పిస్తారు. పక్కనే అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుని, బహిరంగసభలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు పారిశ్రామికవేత్తలు, ఇతర విశిష్టులతో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.45 గంటలకు రోడ్డు మార్గంలో బహిరంగసభ నుంచి పరమసముద్రం గ్రామంలోని హెలిప్యాడ్ వద్దకు 3.55కు చేరుకుని బెంగుళూరుకు 4.40 గంటలకు చేరుకుంటారు. అక్కడనుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు బయల్దేరి వెళతారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌పి మణికంఠ చందోల్ రెండు రోజుల ముందు నుంచే భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛిత ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. కృష్ణాజలాలు కుప్పంకు తీసుకొచ్చిన భగీరథుడు చంద్రబాబునాయుడు జలహారతికి అందరూ హాజరుకావాలని ఎంఎల్‌సి శ్రీకాంత్ కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ గుడిపల్లి, రామకుప్పం, శాంతిపురం, కుప్పం నాలుగు మండలాల్లో 49 కిలోమీటర్ల మేర హంద్రీనీవా సుజలస్రవంతి నీరు పారుతోందని, ఈ కార్యక్రమానికి వృద్ధులు, పిల్లలు రావద్దని సూచించారు. ఏడువేల మంది సభకు హాజరుకానున్నారు. కర్పూర హారతులు, కొబ్బరికాయలు,పూలతో కృష్ణాజలాలను స్వాగతించాలని విజ్ఞప్తి చేశారు. పరమసముద్రం వద్ద ముఖ్యమంత్రి పాల్గొనే ఘాట్‌లో భద్రతా చర్యలను, వేదికను గురువారం పరిశీలించారు.

'బషీర్‌బాగ్' విద్యుత్ పోరాట స్ఫూర్తితో..
'స్మార్ట్' దోపిడీ అడ్డుకుంటాం..!

- భరించలేనంతగా బిల్లుల భారం
- జిల్లావ్యాప్తంగా వామపక్షాల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ, యంత్రాంగం

'విద్యుత్ రంగాన్ని ఆదాయ వనరుగా మార్చేశారు.. కూటమి ప్రభుత్వం ప్రజలకు వాతలు, కోతలు పెడుతూ, అదానీ, అంబానీలకు లాభాలను దోచి పెడుతోంది.. బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ పోరాటంలో అశువులుబాసిన అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజలపై భారాలు మోపే విద్యుత్ ఛార్జీల పెంపును, స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకుంటాం' అని వామపక్షాలు ప్రతినబూనాయి. జిల్లావ్యాప్తంగా 'విద్యుత్ పోరాట అమరవీరులకు' నివాళి అర్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయకపోతే కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గురువారం తిరుపతి బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలయంలో విద్యుత్‌పోరాటంలో తుపాకి తూటాలకు బలైన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామిలకు విప్లవజోహార్లు అర్పించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.హరికృష్ణ, సుసి పార్టీ జిల్లా కార్యదర్శి హరీష్, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ప్రసంగించారు.

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ 2000వ సంవత్సరంలో ఆగస్టు 28న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వామపక్షాలు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో శాంతియుతంగా ర్యాలీ జరుగుతుండగా నాటి చంద్రబాబునాయుడు ప్రభుత్వం విచక్షణారహితంగా కాల్పులు జరిపి రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలను పొట్టన పెట్టుకుందన్నారు. అనేకమంది కార్యకర్తలు పోలీసు లాఠీలకు, గుర్రాల దాడులకు, తుపాకీ తూటాలకు గాయాలపాలయ్యారన్నారు. వైసిపి హయాంలో

తిరుపతిలో..

ప్రతిపక్షంగా ఉన్న టిడిపి 'బాదుడే బాదుడు' అనే పోరాటానికి నాయకత్వం వహించి, అధికారంలోకి రాగానే 'మోదుడే మోదుడు' అనే చందంగా సర్‌ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో వినియోగం గోరంత, కరెంట్ బిల్లు కొండంత అనే చందంగా విద్యుత్ ఛార్జీల భారాలను మోపుతోందన్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకుని అంబానీ, అదానీ, షిరిడీసాయి లాంటి సంస్థలకు అధిక ధరకు ఒప్పందాలు చేసుకుని, వాటి భారాన్ని ప్రజలపై రుద్దేందుకు సిద్ధం చేశారన్నారు. ఉన్న మీటర్లు పక్కన పెట్టి స్మార్ట్ మీటర్ల పేరుతో స్మార్ట్ దోపిడీకి శ్రీకారం చుట్టారన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన వనరులు అందుబాటులో ఉన్నా, కార్పొరేట్ కంపెనీల నుంచి ప్రణాళికాబద్ధంగా అడ్డగోలు ఒప్పందాలు చేసుకుని, భారాలను ప్రజలపై మోపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నం పెంచలయ్య, కె.రాధాక్రిష్ణ, జయచంద్ర, సాయిలక్ష్మి, రామిశెట్టి వెంకయ్య పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తిలో.. ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేద్కర్ కూడలిలో వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జనమాల గురవయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య పాల్గొన్నారు.

- రేణిగుంటలో తారకరామనగర్ శాఖ పరిధిలో ప్రతిజ్ఞ చేశారు. నాయకులు ఒ.వెంకటరమణ, శివానందం, ఈశ్వరమ్మ, సత్యశ్రీ, దిలీప్‌బాష, చీరాలయ్య, భారతి, మురళి, తులసిరాజన్ పాల్గొన్నారు.

- పుత్తూరు టౌన్‌లో... అంబేద్కర్ సర్కిల్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. నాయకులు వెంకటేష్, శివ, రామ్మూర్తి పాల్గొన్నారు.

- గూడూరు టౌన్‌లో.. టవర్‌క్లాక్ సెంటర్‌లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, పామంజి మణి, బివి రమణయ్య, ఎంబేటి చంద్రయ్య, బి.చంద్రయ్య, రమేష్, సిపిఐ నాయకులు మీరాబాయ్, రమేష్ పాల్గొన్నారు. సూళ్లూరుపేటలోనూ నిర్వహించారు.

- కెవిబిపురంలో.. కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. నాయకులు నాగలాపురం నాగరాజు, లక్ష్మయ్య, శ్రీను, నవీన్, చంద్ర, కన్నెమ్మ, సుబ్బమ్మ, దేవి పాల్గొన్నారు.

- పాకాలలో.. ఆర్టీసీ బస్టాండ్ సమీప కూడలిలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదనరావు ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు నరేంద్ర,రాజా, వేణు, ఓబయ్య, వెంకటముని, చెంగల్రాయులు, మాతయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

- ఏర్పేడులో.. సిపిఎం నాయకులు రంగయ్య, కరీముల్లా ఆధ్వర్యంలో అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజలను ఐక్యపరచి పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎఐటియుసి వికృతమాల కార్యాలయం వద్ద సర్దార్ శివకుమార్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు.

శ్రీకాళహస్తిలో..

గూడూరులో..

పాకాలలో..

నిమజ్జన ఏర్పాట్లు కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలోని వినాయకసాగర్‌లో వినాయక నిమజ్జన ఏర్పాట్లను బుధవారం రాత్రి కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు సిబ్బందికి వివరించారు. విగ్రహాలను తీసుకు వచ్చేవారు పోలీసులు సూచించిన మార్గంలోనే వెళ్లి నిమజ్జనం చేయాలని అన్నారు. నిమజ్జన సమయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తెప్పలపైకి ఎక్కువ మంది వెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఆదివారం ఎక్కువ విగ్రహాలు వస్తాయని, అన్ని శాఖల అధికారులు, నిమజ్జన కమిటీ ప్రతినిధులు సమన్వయం చేసుకుని జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికష్ణ, బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డీఎస్పీ భక్తవత్సలం, నిమజ్జన కమిటీ చైర్మన్ సామంచి శ్రీనివాస్, గుండాల గోపి తదితరులు ఉన్నారు. బుధవారం ఉదయం నగర పాలక సంస్థ కార్యాలయంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికష్ణ పాల్గొని పూజలు చేశారు.

వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించాలి

నగరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరంలో గోవిందరాజ స్వామి మాడా వీధులు, రైల్వే స్టేషన్, పిజిఆర్ థియేటర్ రోడ్డు, పి.కె.లేఔట్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఏర్పడిన తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను ఎప్పటికప్పుడు వేర్వేరుగా సేకరించాలని అన్నారు. మాడా వీధుల్లో దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన చెత్త బుట్టలను పరిశీలించి అన్ని దుకాణాల వద్ద ఏర్పాటు చేయించాలని అన్నారు. వినాయక చవితి సందర్భంగా అక్కడక్కడ కాలువల్లో చెత్త వేస్తున్నారని, నిర్వాహకులకు అవగాహన కల్పించి పారిశుధ్య కార్మికులకు ఇచ్చేలా చేయాలని అన్నారు. కమిషనర్ వెంట శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు ఉన్నారు.

స్మార్ట్ సిటీ పెండింగ్ పనులు పూర్తి చేయండి : కలెక్టర్

స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న అభివద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ చైర్మన్, కలెక్టర్ డాక్టర్.ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. తిరుపతి స్మార్ట్ సిటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల 40 వ సమావేశం గురువారం జరిగింది. ఆన్లైన్ ద్వారా చైర్మన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తుడా వి.సి. శుభం బన్సల్ పాల్గొనగా, నగరపాలక సంస్థ కార్యాలయం నుండి స్మార్ట్ ఎం.డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొన్నారు. పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. మెగా వాట్స్ సోలార్ ప్రాజెక్టు పరిశీలించి పిపిపి మోడ్ లో నిర్వహణ చేసేందుకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ ప్రాజెక్టు తో పాటు ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ ఇండిపెండెంట్ డైరెక్టర్స్ డాక్టర్ రామచంద్ర రెడ్డి, డాక్టర్. రమాశ్రీ పాల్గొన్నారు.

అర్హులందరికీ వికలాంగ పింఛన్లు ఇస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అర్హులైన ప్రతి వికలాంగునికీ పింఛను అందేలా చర్యలు తీసుకుంటామని, నోటీసులు అందుకున్న అర్హులైన వారు సరైన ధవపత్రాలతో త్వరలో నిర్వహించబోయే రీ అసెస్మెంట్ కార్యక్రమంలో భాగంగా పరీక్షకు హాజరు అవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ అధ్యక్షతన వికలాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, రామచంద్ర, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలకష్ణ నాయక్, రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, డిసిహెచ్ఎస్ ఆనందమూర్తి, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబుతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పింఛన్లను పున్ణ పరిశీలన చేసే క్రమంలో అర్హులైన వికలాంగులను అనర్హులుగా గుర్తించడంతో తీవ్ర అన్యాయం జరిగిందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దష్టికి వికలాంగుల ప్రతినిధులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అప్పీలు చేసుకున్న పింఛన్ లబ్ధిదారులందరికీ సంబంధిత ఆసుపత్రులలో సదరం వెరిఫికేషన్ క్యాంపులు ఏర్పాటు చేసి అత్యంత జాగ్రత్తగా పరిశీలించే విధంగా తగిన ఆదేశాలు ఇస్తామన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా పింఛన్ల పంపిణీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇస్తున్నామన్నారు. వికలాంగ ప్రతినిధులు మాట్లాడుతూ వైకల్యం శాతం ఎక్కువ ఉండి తక్కువగా నమోదు చేయడం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ ప్రయోజన ఫలాలను తాము కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. 80 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి ప్రభుత్వం లక్ష రూపాయల కంటే ఎక్కువ విలువ గల మూడు చక్రాల వాహనాన్ని ఉచితంగా అందిస్తోందని, రైల్వే శాఖ ద్వారా తమతో పాటుగా ప్రయాణించే తమ సహాయకులకు 75 శాతం వరకు చార్జీలలో మినహాయింపు రాయితీని కోల్పోతామని, ప్రభుత్వ ఉద్యోగాలలో వైకల్యం శాతం ఆధారంగా ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, వైకల్యం శాతాన్ని తగ్గిస్తే ఇటువంటివన్నీ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను కోల్పోతామని, వీటిల్లో ఎక్కడ నష్టం జరగకుండా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరికి ఎటువంటి నష్టం జరగకుండా రీ అసెస్మెంట్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

టిడిపి అధ్యక్ష పదవులకు 'క్యూ'

- ఉమ్మడి జిల్లాలో పెద్దసంఖ్యలో ఆశావాహులు
- చంద్రబాబుపైనే ఎంపిక భారం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పదవులకు ఉమ్మడి జిల్లాలో 'క్యూ' కడుతున్నారు. 'సీనియార్టీ నాకుంది.. పార్టీ కష్టకాలంలో కేసులు బనాయించుకున్నా.. పార్టీ కోసం సొంత డబ్బులు ఖర్చు చేశా.. వలస వచ్చిన వారిని పక్కన పెట్టాలి.. అధ్యక్ష పదవి నాకే ఇవ్వాలి' అంటూ ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వారం రోజుల క్రితం వచ్చిన త్రిమెన్ కమిటీ సభ్యులకు తెగేసి చెప్పారు. చిత్తూరు జిల్లాలో అధ్యక్ష పదవికి 20 మందిపైనే ఉన్నారు. తిరుపతి జిల్లాలో15 మందిపైనే పోటీలో ఉన్నారు. రెండు జిల్లాల పార్లమెంటరీ కమిటీ సమావేశాలకు హాజరైన త్రిమెన్ కమిటీలు అధ్యక్షులను ఏకగ్రీవం చేయకనే వెనుదిరిగాయి. అధ్యక్ష పదవి ఎంపిక బాధ్యత అధినేతకే వదిలేయడంతో చంద్రబాబే స్వయంగా రంగంలోకి దిగే అవకాశం ఉంది.

చిత్తూరు జిల్లాలో వన్నెకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన సిఆర్ రాజన్‌కు ఎన్నికల ముందు ఆ జిల్లా అధ్యక్ష బాధ్యతను అప్పగించారు. 2024 ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీకి సిఆర్ రాజన్ పోటీ పడినప్పటికీ పార్టీ అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు వన్నెకులక్షత్రియ అభివృద్ధి మండలి రాష్ట్ర ఛైర్మన్‌గా సిఆర్‌రాజన్‌కు పదవిని కట్టబెట్టారు. అధ్యక్ష పదవీకాలం కూడా ముగియడంతో పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేసి కొత్తగా అధ్యక్షుని ఎన్నుకోవాల్సిన ఉంది. ఇటీవల చిత్తూరులో జరిగిన సమావేశానికి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, ఎంఎల్‌సి ఆలపాటి రాజేంద్ర, లీడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు హాజరయ్యారు. అయితే 20 మందికి పైగా పోటీలో ఉన్నామని ఆశావాహుల వినతులు వెల్లువెత్తాయి. అధ్యక్ష పదవికి తాము తక్కువ కాదని ఎవరికి వారే తమకున్న అర్హతలను వివరించారు. ప్రస్తుత అధ్యక్షులు సిఆర్ రాజన్ సైతం తననే మళ్లీ కొనసాగించాలని కోరుతున్నారు. మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ కాజూరు బాలాజీ, జడ్‌పి మాజీ ఛైర్మన్ గీర్వాణి భర్త జయప్రకాష్, బంగారుపాళ్యం చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఎన్‌పి ప్రకాష్‌నాయుడు, ఎస్ఆర్ పురానికి చెందిన ఎన్ఆర్ఐ వినోద్, ఐరాలకు చెందిన గురజాల సందీప్, యువగళం పాదయాత్రలో అన్నీ తానై వ్యవహరించిన వసంత్‌కుమార్, ఐరాల మండలానికి చెందిన గిరినాయుడు, మహిళా కోటాలో కార్జాల అరుణ, పాలసముద్రం మాజీ జడ్‌పిటిసి చిట్టిబాబు తదితరులు పోటీలో ఉన్నారు. అయితే ఇంతమంది పోటీలో ఉండడంతో కార్యకర్తలు ఎవరివైపు మొగ్గుచూపుతారో వారినే అధిష్టానం ప్రకటిస్తుందని, అప్పటివరకూ వేచి ఉండాలని త్రిసభ్య కమిటీ చెప్పేసి వెళ్లిపోయింది.

తిరుపతి జిల్లాలో మంగళవారం ఓ ప్రైవేట్ హోటల్లో తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి సవిత, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ హాజరయ్యారు. 15 మంది ఆశావాహులు ఎవరికి వారే పోటీ పడ్డారు. వినతులు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి శాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, కురగొండ్ల రామకృష్ణ మాత్రం ఇప్పటివరకూ అధ్యక్ష పదవిలో ఉన్న నరసింహయాదవ్‌నే కొనసాగించాలని, కొత్తవారికి అవకాశం ఇస్తే యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్‌ఎ ఎస్సీవీ నాయుడు తానూ బరిలో ఉన్నానని చెప్పారు. తెలుగుదేశం పార్టీ యువ రాష్ట్ర నాయకులు, యువగళం పాదయాత్రలో కీలకంగా వ్యవహరించిన శ్రీధర్‌వర్మ సైతం ఆశిస్తున్నారు. ఎక్కువమంది శ్రీధర్‌వర్మకే ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. తిరుపతికి చెందిన సూరా సుధాకర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, దంపూరి భాస్కర్‌యాదవ్, పుష్పావతి, సతీష్‌రెడ్డిలు, సత్యవేడు నియోజకవర్గం పార్టీ కన్వీనర్ కూరపాటి శంకర్‌రెడ్డి రేస్‌లో ఉన్నారు. పలువురు పోటీ ఉండడంతో త్రిమెన్ కమిటీకి ఇక్కడా తలనొప్పిగా మారడంతో అధినేతకే వదిలేశారు.

లంకెల బద్రీనాథ్‌ను సత్కరించిన ఆర్టీవో

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తిరుపతి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అమెరికాలోని మూడు శాఖలకు మంత్రిగా పనిచేస్తూ 24 జిల్లాలకు కమిషనర్ గా వ్యవహరిస్తున్న లంకెల బద్రీనాథ్ గురువారం స్థానిక అధికారులను కలిసి మాట్లాడారు. స్వగ్రామానికి వచ్చిన ఆయన తాను ట్రాన్స్ పోర్ట్ ఇంజనీరింగ్ లో స్పెషలైజేషన్ చేశానని ప్రస్తుతం రవాణా శాఖ పరిధిలోనే రహదారులన్నీ ఉన్నాయా లేక నూతన మార్పులు తీసుకు వచ్చారా అని ఆర్టీవో మురళీమోహన్‌ను అడిగారు. ఆర్టీవో రవాణా శాఖ నిర్వహిస్తున్న సేవలను, వాహనాల తనిఖీల విషయాలను మంత్రికి విశదీకరించారు. ఈ సందర్భంగా మంత్రి లంకెల బద్రీనాథ్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, అతికా నాజ్, పరిపాలన అధికారులు విజయ్ కుమార్, విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

ఎస్వీ జూ పార్కులో విదేశీ జంతువులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు నూతనంగా విదేశీ జాతులకు సంబంధించిన జంతువులను అధికారులు గుజరాత్ నుండి తీసుకొచ్చారు. రాధేకష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ అందించిన ఈ జంతువులలో ఒక జంట రెడ్-నెక్డ్ వాలాబీలు, ఒక జంట మీర్కాట్స్, ఒక జంట కామన్ మార్మోసెట్స్ కోతులు ఉన్నాయని జూ అధికారులు తెలిపారు. ఈ మూడు రకాల జంతువులను ఎస్వి జూ పార్కులోని "సంజీవని' బ్లాక్‌లో ప్రత్యేకంగా ఉంచామన్నారు. నిర్ధారిత క్వారంటైన్ కాలం పూర్తి అయ్యేవరకు అవి ఇక్కడే ఉంటాయని, ఈ సమయంలో జంతువుల ఆరోగ్యం, అనుకూలత పర్యవేక్షిస్తామన్నారు. ఎస్వి జూ పార్కులో జంతువుల కోసం కొత్త ఆవరణల నిర్మాణానికి రాష్ట్ర అటవీశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ గతంలో జరిగిన జంతుశాల బోర్డు సమావేశంలో ఇందుకోసం రూ.55 లక్షల రూపాయలను కేటాయించారని జూక్యురేటర్ సెల్వం తెలిపారు.

మంత్రి సవితకు బీసీ ఉద్యోగులు వినతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను టిటిడి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిసి, బీసీ ఉద్యోగాల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోన్నతులు రాని ఉద్యోగులకు న్యాయం చేయాలని, తిరుమల కళ్యాణకట్టాలో, మరణించిన/రిటైర్ అయిన మిరాసిదార్ క్షౌరవేత్తలపై ఆధారపడి ఉన్న అర్హత కలిగిన వారసులను నియమించడంపై చర్యలు తీసుకోవాలన్నారు. పారదర్శకంగా, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీసీ ఉద్యోగ బదిలీలను అమలు చేయాలన్నారు. టిటిడి బీసీ ఉద్యోగుల సమస్యల పట్ల గ్రీవెన్స్ మీటింగ్ చాలా సంవత్సరాలుగా జరగలేదని, త్వరగా ఒక గ్రీవెన్స్ మీటింగు ఈవో, జెఈఓతో జరిపించి బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పి.రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి గంగా రాజ్‌కుమార్, కోశాధికారి కమరాజ, యువరాజ్, నాగేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ధనపాల్ చేతుల మీదుగా సీఎం సహాయ నిధి ద్వారా మంజూరయిన చెక్కులను గురువారం పంపిణీ చేశారు. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కళ్యాణపురానికి చెందిన జి.కుసుమ కుటుంబానికి రు. 45,350 /- చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు, యూనిట్ ఇంచార్జ్ ఎం.ఈశ్వర్ యాదవ్, చిత్తూరు పార్లమెంటు ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎం.చెంచయ్య, బాలకృష్ణ (బుజ్జి), ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా నటుడు సుమన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : సినీ నటుడు సుమన్ జన్మదిన వేడుకలను ఎస్వీ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద సుమన్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దంపూర్ భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ నటుడు సుమన్ ఆధ్యాత్మిక చిత్రమైన అన్నమయ్య సినిమాలో వెంకటేశ్వర స్వామి పాత్రలో అద్భుతంగా నటించారన్నారు. ప్రకృతి డెవలప్మెంట్ అధినేత శ్రీనివాస్ రావు మాట్లాడుతూ నటుడు సుమన్ దేశంలోనే ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్నారన్నారు. డాక్టర్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఆయన రాజకీయ రంగ ప్రవేశం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పవన్ యాదవ్, మణికంఠ, కోదండరామిరెడ్డి, నాగరాజు, రవికుమార్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, నారాయణస్వామి, ఈశ్వరయ్య, ఉదయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో రేపు జాబ్ మేళా

ప్రజాశక్తి - క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో 30న శనివారంఉదయం 8 గంటల నుంచి ఎస్వీసిసి డిగ్రీ కళాశాల, బాలాజీ కాలనీ, తిరుపతి నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి ఆర్.లోకనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలోని చదువుకుని ఖాళీగా ఉన్నటువంటి నిరుద్యోగ యువతి యువకుల కోసం ఈఎంసి క్లస్టర్, శ్రీ సిటీ , తిరుపతి, చెన్నైలోని 12 బహుళ జాతీయ కంపెనీలలో 400 పైగా ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత అయిన యువతి యువకులు ఈ జాబ్ మేళాకు అర్హులు అన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు రిజిస్ట్రేషన్ లింక్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 917993024898, 9988853335 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని ఆర్ లోకనాథం వివరించారు.

చెత్త ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మున్సిపాలిటీలో ప్రధాన దీర్ఘకాలిక సమస్యగా చెత్త వేసే స్థలం లేకపోవడం.. సమస్య పరిష్కార దిశగా పెరటిపాటు పరిసర ప్రాంతాల్లో పది ఎకరాల స్థలాన్ని ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్ ఎంపిక చేశారు. అయితే ఆ స్థలంలో చెత్త వేసేందుకు వీల్లేనది పెరటిపాడు గ్రామస్తులు చెత్త తీసుకొచ్చిన ట్రాక్టర్లను గురువారం అడ్డుకున్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం సేకరించిన చెత్త అంతా తమ గ్రామంలో తీసుకొచ్చి వేయడం ఎంతవరకూ సమంజసమని పెరటిపాడు గ్రామస్తులు అడ్డుకున్నారు.

ఉపాధి కూలీలకు రూ. 307 వచ్చేలా చూడాలి

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని బందారుపల్లి పంచాయతీలో జరుగుతున్న వాటర్ హార్వెస్టింగ్ పాండ్ పనులను పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొలతల ప్రకారం పని చేయించి కూలీలకు వేతనం 307 రూపాయలు వచ్చేలా చూడాలని, పనికి వచ్చిన ప్రతి కుటుంబం 100 రోజులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుజాత, ఏసీ సుశీల, టెక్నికల్ అసిస్టెంట్ సి వెంకటయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ రెడ్డి, మెట్లు ఉమామహేశ్వరి, మునెమ్మ పాల్గొన్నారు.

వన, వన్య ప్రాణుల రక్షణపై సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుమలలో అటవీ వృక్ష సంపద పెరుగుదల, మానవులు-వన్య ప్రాణుల సంఘర్షణ నివారణ చర్యలపై అటవీ శాఖ అధికారులతో టీటీడీ ఈవో జె.శ్యామలారావు గురువారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో టీటీడీ డీఎఫ్‌ఓ ఫణికుమార్ నాయుడు గత ఏడాది తిరుమలలో చేపట్టిన వృక్షారోహణ కార్యక్రమాలు, దశలవారీగా అకేసియా ఆరికులిఫార్మిస్ వృక్షాల స్థానంలో, స్థానిక వృక్షజాతుల పెంపకం, ఔషధ వనాల అభివృద్ధి, సుస్థిర అటవీ పునరుద్ధరణ చర్యలు వంటి అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గత ఏడాదిలో లక్ష్యంగా పెట్టుకున్న 20 వేల మొక్కల్లో భాగంగా ఇప్పటివరకు తాండ్ర, రావి, ఉసిరి, వెలగ, జువ్వి, మర్రి, నేరేడు, అత్తి మరియు ఎర్రచందనం వంటి స్థానిక జాతుల 7,000 మొక్కలు నాటినట్టు వివరించారు. అదనంగా, వాటర్‌షెడ్, మట్టి స్థిరీకరణ కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించారు. వన్యప్రాణుల నిర్వహణలో భాగంగా, అలిపిరి-తిరుమల మార్గాల రెండు వైపులా 60 కెమెరా ట్రాపులు, 31 సౌర శక్తితో నడిచే యాక్టివ్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో శ్యామలారావు అటవీ శాఖ అధికారులు మరింత ఆధునిక నిఘా కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, తిరుమలకు సమగ్ర పర్యావరణ సుస్థిరత ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

మత్తుపదార్థాలపై పోలీసుల ఉక్కు పాదం

▮ 12 కేజీల గంజాయి స్వాధీనం ▮ మత్తు పదార్థాలు వాడినా, విక్రయించినా ఉపేక్షించేది లేదు : సీఐ బాబి

ప్రజాశక్తి - నాయుడుపేట: పట్టణంలో మితిమీరిపోతున్న మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించాలన్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు సూచనలతో నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు ఆదేశానుసారం అర్బన్ సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి నాయుడుపేట పట్టణంలో మత్తు పదార్థాలను విక్రయిస్తున్న వారి కదలికలపై నిఘా ఉంచి కట్టడి చేస్తున్నారు. గడిచిన ఈ ఐదారు నెలల్లో నిర్వహించిన మూడు నాలుగు దాడుల్లో దాదాపుగా 50 కేజీల వరకు గంజాయి పట్టుకున్నారు. అయినప్పటికీ చుట్టుపక్కల జిల్లాల, రాష్ట్రాల నుంచి సైతం అనేక మంది స్మగ్లర్లు ఈ దందా నిర్వహిస్తూ ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఎస్సై ఆదిలక్ష్మికి 26వ తేదీ మంగళవారం ఒక నమ్మకమైన సమాచారం రావడంతో నాయుడుపేట తహసీల్దార్ ఎం.రాజేంద్ర మరో ఇద్దరు వీఆర్వోల సహకారంతో నాయుడుపేట మండలంలో అటవీ ప్రాంతమైన శ్రీనివాసపురంలో సోదాలు నిర్వహించగా అక్కడ గంజాయి ప్యాకెట్లను మార్చుకుంటున్న ఆరుగురు వ్యక్తుల వద్ద నుంచి సుమారు రెండున్నర లక్షల విలువచేసే పదకొండున్నర కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఆరుగురు వ్యక్తులని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు సెల్ ఫోన్లు, రెండు మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ బాబి దర్యాప్తుచేసి వివరాలను వెల్లడించారు. గంజాయి ముఠాలో దొరికిన ఆరుగురు, కలపాడి జాన్ బ్లెస్సన్, నాయుడుపేటకు చెందిన హర్షవర్ధన్, వినోద్, సెల్వం (అలియాస్ గురు), గూడూరుకు చెందిన శ్రీకాంత్, తమిళనాడుకు చెందిన రాకేష్‌లుగా గుర్తించారు. వీరిలో మొదటి నిందితుడు జాన్ బ్లెస్సన్ ఒక పెద్ద గంజాయి స్మగ్లర్ అని గతంలో కూడా ఎన్నోసార్లు గంజాయి రవాణా చేస్తూ భద్రాచలంలోనూ కడపలోను ఎక్సైజ్ పోలీసులకు దొరికి జైలు శిక్ష అనుభవించినట్లు తెలిపారు. అతను, ఈ ఐదుగురును రాజమండ్రికి చెందిన, నరసింహ ద్వారా గంజాయి తెప్పించుకుని నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. బుధవారం ఉదయం నాయుడుపేట డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ దాడుల్లో పాల్గొన్న నాయుడుపేట అర్బన్ సీఐ బాబీని, ఎస్సై ఆదిలక్ష్మిని, హెడ్ కానిస్టేబుల్ రాజు,రామ్మోహన్ రాజులను కానిస్టేబుల్స్ దయాకర్, మస్తాన్, వెంకటేశ్వర్లు, మునిశేఖర్, భాను, సిహెచ్ వెంకటేశ్వర్లను డి.ఎస్.పి అభినందించి, రివార్డులు అందజేశారు.

ఘనంగా విద్యాస్ వికాస్ స్కూల్‌లో చవితి వేడుకలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వినాయక చవితి వేడుకలు పాఠశాల కరెస్పాండెంట్ విద్యాప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు ఉట్టి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కరెస్పాండెంట్ విద్యా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా విద్యార్థులు ఆచార సంప్రదాయాన్ని, సామాజిక మైత్రిని పాటించాలని సూచించారు.

డివైఇఓ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవద్దు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: టీడీడీలో డివైఇవో పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవడన్ని రద్దు చెయ్యాలని కోరుతూ గురువారం టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవోను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈవోను కలిసిన వారిలో టీటీడీ ఎస్‌డబ్ల్యూయుఎఫ్ నాయకులు గోల్కొండ వెంకటేశం, కాటా గుణశేఖర్, శ్రీలక్ష్మి, నైనార్ పద్మనాభం, ధార రవికుమార్, ఆదిలక్ష్మి తదితరులున్నారు. సుమారు 400 మందికి పైగా గత నాలుగున్నర సంవత్సరాలుగా పదోన్నతులు లేకుండా, పదవి విరమణ అయిన పోస్టులు భర్తీ చేయకుండా తీవ్రమైన పనిబారాన్ని మోస్తూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. టీటీడీ ఉద్యోగుల సమస్యలపై అధికారులతో చర్చిస్తున్నామని, అలాగే ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరపడంవలన ఉద్యోగుల కోణంలో పరిష్కారాలు వినాలని తద్వారా అనేక సమస్యల పరిష్కారానికి సమావేశం జరపాలని కోరగా, 10 రోజుల్లో ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేస్తానని ఈవో హామీ ఇచ్చారు. రెండు-మూడు నెలలుగా టీటీడీ హాస్పిటల్స్‌లో మందుల కొరత వుందని తెలియచేయగా, గురువారం మధ్యాహ్నం టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, సీఎంఓ డాక్టర్ నర్మాదలు డాక్టర్ కుసుమతో సమావేశం ఏర్పాటు చేసారు. ఆ సమావేశానికి టీటీడీ ఎస్. డబ్ల్యూ.యు.ఎఫ్ (సిఐటియు) నుండి కాటా గుణశేఖర్, శ్రీలక్ష్మి హాజరై సెంట్రల్ హాస్పిటల్‌లో మందులు తెప్పించాలని కోరగా, ఇప్పటికే కొన్ని మందులు తెప్పించామని, మిగతావి ఒకటి రెండు రోజులలో తెప్పిస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ బిల్స్, రెఫరల్ హాస్పిటల్స్‌లో 3 లక్షల రూపాయల కన్న అదనంగా ఖర్చు పెట్టుకున్న వారికీ రీఎంబుర్సుమెంట్ చెల్లించాలని కోరారు.

శ్రీలక్ష్మిపై విమర్శలు తగవు: చింతా

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఐఎస్ అధికారి శ్రీలక్ష్మిపై విమర్శలు చేయడం సరైనది కాదని, టీటీడీలు పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో టీటీడీ పరిపాలన భవనం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీలక్ష్మి ఐఏఎస్ ఆఫీసర్ నాకు బాగా తెలుసు. ఆమె బలిజ సామాజిక వర్గానికి చెందినవారు. ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన ఐపీఎస్ ఆఫీసర్‌ను, పెళ్లి చేసుకుంది. శ్రీలక్ష్మి విగ్గులు, ఆమె చీరలు గురించి విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఎక్కడ సంతకం పెట్టమంటే, అక్కడ సంతకం పెట్టి జైలుకెళ్ళింది. మీ వల్ల నష్టపోయింది. ఐదేళ్ల చీఫ్ సెక్రటరీగా ఉండాల్సిన శ్రీలక్ష్మి ఐఎఎస్ ఎంతో కోల్పోయింది. ఆమెపై వచ్చిన విమర్శలను ఖండిస్తున్నానన్నారు. ముంతాజ్ హోటల్‌కి భూమి ఇవ్వొద్దని, అలిపిరి వద్ద టిటిడిలో పనిచేసే అర్చకులందరికీ, ఐదేసి సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు రూ.20వేలు ఇస్తున్నారు. రుయా ఆస్పత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు ఈ నెల నుంచి రూ. 18,600/ ఇచ్చేందుకు అగ్రిమెంట్ జరిగింది. టీటీడీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు, ప్రస్తుతం 11,600/ ఇస్తున్నారు. ప్రతినెలా రూ.18,600/ వేతనం ఇవ్వాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి, ముని శోభ, రావణ్, యార్లగడ్డ గోపి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ-ఐమాప్ పరిశ్రమచే కంప్యూటర్లు వితరణ



ప్రజాశక్తి- వరదయ్యపాలెం : శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో స్థానిక ఐమాప్ పరిశ్రమ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా పుత్తూరు మండలంలోని పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు 7.5 లక్షలు విలువచేసే 15 కంప్యూటర్లు వితరణ ఇచ్చింది. గురువారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఐమాప్ మేనేజింగ్ డైరెక్టర్ టయుజో ఇవామీ ఆధునికరించిన కంప్యూటర్ ల్యాబ్ ను ప్రారంభించి, కంప్యూటర్లను కళాశాల ప్రిన్సిపాల్ కుమార్ కు అందజేశారు. ఐమాప్ సి ఎఫ్ ఓ హరిహరన్, హెచ్‌ఆర్ మేనేజర్లు రాజీవ్, సుప్రియ, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, గోపాలక్రిష్ణాపురం, కేబీఆర్ పురం, వేపగుంట గ్రామపంచాయతీలలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మండల టీడీపీ అధ్యక్షుడు అరవబాలాజీ, ప్రధానకార్యదర్శి హేమంత్, పి.ఆర్.మంగళం సింగిల్ విండో ప్రెసిడెంట్ మోహన్ రాజు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోట : కోట మండలం, చెందోడు పంచాయతీలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ఆదేశాలతో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తిరుపతి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి వాకా విజయ భాస్కర్ రెడ్డి, నీలం సురేంద్ర రెడ్డి, టిడిపి బూత్ కన్వీనర్ చల్లా రమణయ్య, చల్లా వెంకటేశ్వర్లు, సీనియర్ టీడీపీ నాయకులు మొగిలిగుంట వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ సభ్యులు టిడిపి కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

31న టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 31 వ తేదీన టెన్నికాయిట్ సీనియర్, జూనియర్ బాల, బాలికల జిల్లా జట్టు ఎంపిక నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బండి శ్యామసుందరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంపికకు హాజరయ్యే జూనియర్ విద్యార్థినీ విద్యార్థులు 01- 01-2007 తేదీ తర్వాత జన్మించిన వారై ఉండవలన్నారు. విద్యార్థులు బర్త్ సర్టిఫికెట్లు తీసుకొని రావలని తెలిపారు.

రేపు స్త్రీశక్తి పథకం విజయోత్సవ సభ

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చంద్రగిరి): స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభను నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో శనివారం నిర్వహించనున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బాలకృష్ణ తెలిపారు. గురువారం సభా ప్రాంగణంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, కూటమి పార్టీల నాయకులు ఏర్పాట్లును పరిశీలించారు.

క్రీడల్లో హ్యాట్రిక్ విజేత వడమాలపేట బాలుర పాఠశాల

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన 'స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్ లెన్స్' అవార్డులలో వరుసగా మూడవసారి వడమాల పేట పిఎం శ్రీ జిల్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రతి జిల్లా నుండి ఆ విద్యా సంవత్సరంలో పాఠశాలల క్రీడలలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఐదు పాఠశాలలకు 'స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్ లెన్స్ ' అవార్డులను ప్రధానం చేస్తారు. 2024- 25 విద్యా సంవత్సరానికి పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వడమాలపేట 57 మంది రాష్ట్రస్థాయిలో ఒక విద్యార్థి జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరచడం ద్వారా 222 పాయింట్లు సాధించి మూడవ స్థానాన్ని దక్కించుకుంది. గతంలో 2022-23 విద్యా సంవత్సరంలో 97 పాయింట్లతో ఐదవ స్థానంలో, 2023-24 విద్యా సంవత్సరంలో 178 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. వరుసగా మూడు విద్యాసంవత్సరాలలో స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సెన్స్ అవార్డు (క్రీడా ప్రతిభ అవార్డు) జాతీయ క్రీడా దినోత్సవం 2025, ఆగస్టు 29న అందుకోవడం ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయురాలు కరుణా నవనీతం తెలిపారు. అందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రాజును అభినందించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అసత్యాలకు బ్రాండ్ అంబాసిడర్ బిఆర్ నాయుడు : భూమన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అసత్యాలు ప్రచారం చేయడంలో బ్రాండ్ అంబాసిడర్ టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు అని మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. పద్మావతి పురంలోని ఆయన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో టివి5 ఛానల్లో వైసీపీపై అనునిత్యం అసత్యాలు ప్రచారం చేశారని ఆరోపించారు. దానికి బహుమతి గా చంద్రబాబు నాయుడు బిఆర్ నాయుడుకి టీటీడీ చైర్మన్ పదవిని ఇచ్చాడన్నారు. ఇటీవల బిఆర్ నాయుడు తనను వ్యక్తిగతంగా దూషించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అలిపిరి సమీపంలో కోట్లు విలువ చేసే భూమిని ఓబెరాయ్ హోటల్‌కు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నిస్తే, సమాధానం చెప్పలేదన్నారు. ఉత్తరం, దక్షిణం అంటూ సరిహద్దులు గీయడం హాస్యాస్పదమన్నారు. శ్రీవారి ఆలయ పరిరక్షణ పర్యవేక్షకుడిగా ఉన్న అతను ప్రతి ఒక్కరికి జవాబుదారంగా ఉండాలని, చేతనైతే తమడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలే తప్ప ఎలాంటి బూతు పురాణాలు చేస్తే మంచిది కాదని హితవు పలికారు.

ఏ అర్హతతో బిఆర్ నాయుడును నియమించారు ? : మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడి చైర్మన్‌గా ఏ అర్హత ఉందని బిఆర్ నాయుడును సీఎం నియమించారని, శ్రీవారి పాదాల చెంత ఆయన నోటి దురుసు మాటలు మాట్లాడడం భావ్యమాని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఎన్నో నూతన కార్యక్రమాలను తీసుకొచ్చారని, అలాంటి వ్యక్తిని లక్ష్యం చేసుకుని పరుష పదజాలంతో దూషించడం మంచి పద్ధతి కాదన్నారు. విచక్షణా రహితంగా మాట్లాడడం ఇకనైనా మానుకోవాలని సూచిస్తున్నామన్నారు.

టీటీడీని దోచేసిన ఘనుడు భూమన : ఓవి రమణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీని దోచేసిన ఘనుడని, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు ఓ.వి.రమణ ఆరోపించారు. ఆయన నివాసం వద్ద గురువారం విలేకరులతో మాట్లాడుతూ కళ్యాణమస్తును భూమన రాజకీయ వేదికగా మార్చాడని, భిక్షగాళ్లను తెచ్చి పెళ్లిళ్ల చేయించారని తెలిపారు. కలెక్టర్లకు టార్గెట్ ఇచ్చి పెళ్లిళ్ల జరిపించారని గుర్తు చేశారు. విశాఖలో దళిత గోవిందం నిర్వహించి అగ్గిపెట్టెలకు రూ.12 వేలు ఖర్చు చేశారన్నారు. ఆడిట్ రిపోర్టులో భూమన అవినీతి బయటపడిందన్నారు. సామాన్య భక్తులకు ఒక్క కాటేజీ అయినా కట్టించావా భూమనా అని ప్రశ్నించారు. సామాన్య భక్తులకు అవసరమైన ఒక్క నిర్ణయం తీసుకోలేదు, రుషికేష్‌లో 20 ఎకరాలను భూమన నొక్కేయాలని చూశాడని, దీంతో దాత ఆ స్థలాన్ని విరాళంగా ఇవ్వకుండా వెళ్లిపోయారని తెలిపారు. శ్రీవారి ప్రసాదంలో నెయ్యి కల్తీ కాలేదని భూమన చెప్పగలడాని ప్రశ్నించారు. దేవుడి సొమ్ముతో కమీషన్లకు కక్కుర్తి పడ్డ వ్యక్తి భూమన అని దుయ్యబట్టారు.

నేత్రదానం ద్వారా మరొకరికి కొత్త జీవితం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీవారి భక్తులు, ప్రజలు స్వచ్ఛందంగా నేత్రదానం చేసి ఎంతో మందికి కొత్త జీవితాన్ని అందించాలని టిటిడి ఈఓ జె. శ్యామలారావు పిలుపునిచ్చారు. తిరుపతి అలిపిరి సమీపంలోని శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రిలో గురువారం నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 9398358828ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వీసీ, డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి.కుమార్, అరవింద్ ఆసుపత్రి జీఎం కేశవకుమార్, డీఎంహెచ్ఓ మురళీకృష్ణ, తిరుపతి ఆఫ్థాల్మాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సురేంద్ర, టిటిడి ఎస్ఎంఓ డాక్టర్ కుసుమతో పాటు పలువురు వైద్యులు, అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణేషుడి ఉత్సవాలు

ప్రజాశక్తి- ఏర్పేడు : ఏర్పేడు మండలం, చింతలపాలెంలో గొర్రె భాను ప్రసాద్ గత రెండేళ్ల నుండి వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకొని విగ్రహ ప్రతిష్ఠ నుండి నిమజ్జనం వరకు తన సొంత వ్యయంతో నిర్వహిస్తున్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో వినాయక చవితి పండుగ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గణనాథుడిని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ దర్శించి పూజలు నిర్వహించారు. బీసీ కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గూడూరు మండల పరిధి, చెన్నూరు, సినిమా హాలు విధి ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయకునికి చేవూరు విజయ మోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజాశక్తి -కోట : కోట క్రాస్ రోడ్డు సమీపంలో వినాయక యూత్ శివ కోటేశ్వరరావు కట్టా, గోపి సారిక ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయక ప్రతిమను కూడా వారి దాతృత్వంలో ఏర్పాటు చేశారు. బుధవారం కోట మండల వ్యాప్తంగా చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు వినోద్ కుమార్ రెడ్డి స్వామి వారి విగ్రహాలను ఆవిష్కరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు.

భారీ వినాయకునికి నెలవల ప్రత్యేక పూజలు



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలో గ్రంథాలయం వద్ద వినాయక చవితి సందర్భంగా ఎస్ ఎ జ్యువలరీ అధినేత పొట్లపూడి రాజేష్ బృందంచే ఏర్పాటుచేసిన భారీ గణనాథుడి విగ్రహానికి నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులతో కలసి తొలి పూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ ఇంతటి గొప్ప కార్యక్రమం నిర్వహించిన రాజేష్, వారి బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం(తిరుపతి రూరల్): మండల పరిధిలోని, తుమ్మలగుంటలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తరపున ఆయన కుమారుడు మోహిత్ రెడ్డి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరాయ్యరు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వినాయక చవితిని పురస్కరించుకుని యువత రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. స్థానిక శ్రీకృష్ణ నగర్‌లోని ఎస్ కేఎన్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకు సహకారంతో 20 మంది యువకులు రక్తదానం చేశారు. యువత రక్తదానం చేసి మరొక ప్రాణాల్ని కాపాడేందుకు కృషి చేయాలని, ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

క్రైం న్యూస్

రాజస్థాన్ వ్యక్తి ఆత్మహత్య

మొదరం (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి -దొరవారిసత్రం : రాజస్థాన్ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన మండల పరిధిలోని, మినమాలముడి గ్రామంలో చోటుచేసుకొంది. పోలీస్‌లు తెలిపిన వివరాలు మేరకు రాజస్థాన్‌కు చెందిన, మొదరం(32) మునిమాల ముడి గ్రామంలో, వినాయక బొమ్మలు, తయారు చేసుకొని జీవించేవాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున అతను మృతి చెందినట్లు గ్రామస్తులు కనుగొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, శవ పంచనామా నిమిత్తం, నాయుడుపేట ప్రభుత్వం హాస్పిటల్‌కి తరలించారు. ఎస్సై అజయ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాప్ ట్యాప్ దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు సమీపంలోని, ఐఐటిలో ఇటీవల ల్యాప్‌ట్యాప్ దొంగతనాలకు పాల్పడిన ముఠాను ఏర్పేడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి పర్యవేక్షణలో, రేణిగుంట ఎస్డిపిఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పేడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.శ్రీకాంత్ రెడ్డి, ఎస్సై ఎన్.శ్రీకాంత్ రెడ్డి, పిఎస్ఐ ఇమామ్ హుస్సేన్, డబ్ల్యూపీఎస్ఐ వెంకటలక్ష్మి, పిసిలు రాజశేఖర్, భారుషా, మహేంద్ర బాబు, మణి, మునీంద్ర, కార్తీక్ లు ప్రత్యేక బృందంగా ఏర్పడి బుధవారం తిరుపతిలో తమిళ సెల్వన్(28), వీరస్వామి గణేషన్(34)లను అరెస్ట్ చేశారు. వారి నుండి 15 లాప్టాప్‌లు, 3 సెల్ ఫోన్లు, ఒక పెన్ డ్రైవ్ (వీటి మొత్తం విలువ సుమారు రూ 8 లక్షలు) స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరులో ఒకరు చెన్నైకు చెందిన తమిళ్ సెల్వన్ అనే వ్యక్తి కాగా, మరొకరు కోయంబత్తూర్‌కు చెందిన వీరాస్వామి గణేషన్‌గా నిర్ధారణలో తేలిందన్నారు. తమిళ్ సెల్వన్ గతంలో బెంగళూరు, చెన్నై, నాగపూర్, జోద్పూర్, భోపాల్ వంటి నగరాల్లో లాప్‌టాప్‌లు దొంగిలించి పోలీసులకు పట్టుబడిన వాడేనన్నారు. తమిళ్ సెల్వన్ ఐఐటి, మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ వంటి విద్యా సంస్థల హాస్టల్లోకి నకిలీ పేర్లతో వెళ్లి విద్యార్థుల రూములలో లాప్టాప్‌లు దొంగిలించేవాడిని, ఇతనికి వీరస్వామి గణేషన్ సహాయం చేస్తూ దొంగతనాలు చేసిన లాప్టాప్‌లు అమ్మే పనిలో ఉండేవాడని తెలిపారు.

హత్యకు దారి తీసిన అక్రమ సంబంధం

మృతుడు అశోక్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రాపురం(చంద్రగిరి) : నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఇందిరమ్మ కాలనీలో అక్రమ సంబంధం ఓ హత్యకు దారి తీసినట్లు స్థానికులు తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో బుధవారం సాయంత్రం ఓ యువకుడు హత్యకు గురైనట్లు పోలీసులకు సమాచారం అందింది. చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు చంద్రగిరి పాతపేట రాములు వారి గుడి వీధికి చెందిన అశోక్ కుమార్ రెడ్డి అలియాస్ కొండపల్లి రాజా (45) గా పోలీసులు గుర్తించారు. ఇందిరమ్మ కాలనీలో ఉన్న ఓ మహిళతో మృతుడికి అక్రమ సంబంధం ఉన్నట్లు స్థానికులు తెలిపారన్నారు. బుధవారం సాయంత్రం అశోక్ కుమార్ రెడ్డి ఇందిరమ్మ కాలనీలోని మహిళ ఇంటికి రావటంతో సదరు మహిళ కుమారుడు అక్బర్ (25) అశోక్ కుమార్ రెడ్డితో గొడవపడ్డాడు. ఈ ఘర్షణలో అశోక్ కుమార్ కత్తిపోట్లకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అక్బర్ గాయాలవడంతో స్థానిక చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. హత్య జరిగిన ప్రదేశంలో మృతదేహం పక్కన రెండు కత్తులు, రాళ్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి పైన రౌడీ షీటర్ ఓపెన్ అయి ఉందని, పలు కేసులలో ముద్దాయిగా కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్లూస్ టీంను రప్పించి చంద్రగిరి ఇంచార్జ్ సిఐ ఇమ్రాన్, ఎస్సై అనిత ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించినట్లు తెలిపారు.

అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండల పరిధిలోని ఎస్‌బిఆర్ పురం గ్రామంలో గురువారం సాయంత్రం, ఆ గ్రామ నివాసుడు తన వ్యక్తిగత పనులను నిమిత్తం పుత్తూరుకు కారులో వెళుతుండగా, మార్గమధ్యంలోని స్మశాన వాటిక సమీపంలో కారుకు అడ్డుగా వస్తున్న ఆవును తప్పించబోయి కారు చెరువులోకి దూసుకెళ్లింది. స్థానికులు గుర్తించి, కారును ట్రాక్టర్ సహాయంతో వెలికి తీశారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా లీలా యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా మంగళం బిటిఆర్ కాలనీకి చెందిన లీలా యాదవ్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉల్లిపాయల శంకరయ్య నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న లీలాయాదవ్ ఈ పదవికి అర్హుడైన భావించి నియమించామని, రెండు సంవత్సరాల కాల పరిమితిలో ఈ పదవిలో కొనసాగుతూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు, వెనుకబడిన తరగతుల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు సూచించినట్లు లీలాయాదవ్ తెలిపారు. తనపై ఉంచిన ఈ బాధ్యతతో మరింత ఉత్సాహంగా బీసీ సమస్యల పట్ల పోరాటం చేస్తానని లీలా యాదవ్ స్పష్టం చేశారు.

శ్రీ గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టు : గూడూరు

I.A.No. 468 / 2024

O.S.No. 9 / 2023

1. వంగిమల్లు మాధవి
2. రేబాల మాలతి - పిటిషనర్లు / వాదులు

Vs.

1. వేమారెడ్డి శారద
మరియు ఇతరులు - రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

నోటీసు

టు,
1. **వాగల రమణయ్య,** తండ్రి **వాగల సుబ్రమణ్యం,** మోమిడి గ్రామం మరియు పోస్టు, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా.
2. **వాగల ఆదెమ్మ,** భర్త పేరు **వాగల రమణయ్య,** మోమిడి గ్రామం మరియు పోస్టు, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా.

- ప్రపోజ్డ్ పార్టీస్ డి28 మరియు డి29 గా ప్రతివాదులుగా చేర్చుటకు

పై పిటిషనర్లు/వాదులు పై దావాను వాగాల రమణయ్య చనిపోయిన కారణమున మీ ఇద్దరిని పై దావాలో పార్టీలుగా చేర్చుటకు **తే4-9-2025ది** మీ నోటీసు కొరకు వాయిదా వేయబడి ఉన్నది. కావున మిమ్మల్ని పై దావాలో పార్టీగా చేర్చుటకు మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల పై తేదిన అనగా **తే4-9-2025దిన ఉదయం 10 గంటలకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. అట్లు ప్లీడరు ద్వారా గానీ, మీరు స్వయముగా గానీ హాజరుకానియెడల పై పిటిషన్‌ను విచారించి తీర్మానించబడును.

యన్.వెంకటేశ్వర రావు
పిటిషనర్లు / వాదులు తరపు న్యాయవాది, నెల్లూరు.